సాక్షి
జనగామ

శుక్రవారం । 6 । జూన్ । 2025



ఉద్యాన పంటల సాగు లాభదాయకం

తక్కువ పెట్టుబడి, ప్రభుత్వ సబ్సిడీ పొందుతూ ఉద్యాన పంటలు సాగు చేస్తే లాభదాయకమని ఉద్యాన అధికారి సుస్మిత తెలిపారు. - 10లో▸



కాజీపేట జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు..

కాజీపేట జంక్షన్ మీదుగా ఆరు వేసవి ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. - 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37⁰ /27⁰

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

గోసంరక్షణ చట్టాలు అమలు చేయాలి



జనగామ రూరల్: గోసంరక్షణ చట్టాలు అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మోహనకృష్ణ భార్గవ అన్నారు. గోవులను రక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం వీహెచ్‌పీ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవులు, ఎద్దులు, దూడలను అక్రమంగా రవాణా చేస్తూ కబేళాలకు తరలించి వధిస్తున్నారని, కొన్ని ప్రాంతాల్లో గోవుల రక్తం ఏరులై పారుతున్నా ప్రభుత్వం గోసంరక్షణ చట్టాలను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో గోశాలతోపాటు గోరక్షణ ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాశం శ్రీశైలం, అంబటి బాలరాజు, చిలువేరు హర్షవర్ధన్, జాన్సీ, బాలనారాయణ, కుందారపు భైరునాథ్, చిక్కుడు నగేష్, సుంచు శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, వేణుగోపాల్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



జనగామ రూరల్: ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు బస్సులను నడిపేటప్పుడు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఏఎస్పీ పండారి చేతన్ నితిన్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రైవేట్ స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్సుల నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రమాదాలు నివారణ చర్యల గురించి వివరించారు.

మోదీ సర్కారు పతనం ప్రారంభమైంది



జఫర్‌గఢ్: మోదీ సర్కారు పతనం ప్రారంభమైందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన స్థానికంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి సంస్థాగత సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు ఆదరిస్తుండగా ప్రతిపక్షాలకు నచ్చడం లేదన్నారు. మంచి పనిచేస్తే పొగడక పోయినా పర్వాలేదు.. దానిని అడ్డుకునే ప్రయత్నం చేయొద్దన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగిరేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. పార్టీ జిల్లా బాధ్యులు లింగం యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, నూకల ఐలయ్య, కట్టా మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో బోధించాలి



జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక నైపుణ్యంతో బోధించాలని డీఈఓ భోజన్న అన్నారు. బెస్ట్ ప్రాక్టీసెస్ రాష్ట్ర సదస్సులో జిల్లా తరఫున వెళ్లిన ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వర్లు, ఎన్.జైపాల్‌రెడ్డి, ఎం.పద్మరాణి, కె.శిరీషరాణి, ఆర్.రామ్మోహన్‌రెడ్డిలను డీఈఓ కార్యాలయంలో గురువారం అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏసీజీఈ రవికుమార్, డీసీఈబీ సెక్రటరీ చంద్రబాను, అసిస్టెంట్ సెక్రటరీ రామరాజు, గౌసియ బేగం, ఏపీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పల్లా'కు స్వాగతం



జనగామ: అమెరికా డాల్లస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు ముగించుకొని తిరిగి స్వదేశానికి విచ్చేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి గురువారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జూకంటి శ్రీశైలం, ముస్త్యాల దయాకర్, నీల యాదగిరి, దేవుని సతీష్, ఉడుముల నర్సింహులు, మామిడాల రాజు తదితరులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు.

హోటల్ ఫుడ్ సేఫేనా..?



పట్టణంలోని ఓ బేకరీ నిర్వహణ ఇలా..

- పట్టణంలో అధ్వానంగా హోటళ్ల నిర్వహణ
- మురికి కూపాలను తలపిస్తున్న కిచెన్ షెడ్లు
- నిల్వ చేసిన చికెన్, మటన్ విక్రయాలు
- ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ కరువు

జనగామ:

హోటల్‌కు వెళ్లి ఆహా ఏమి రుచి అంటూ లొట్టలేసుకుంటూ టిఫిన్లు లాగిస్తున్నారా.. అయితే ఒకటికి రెండు సార్లు చూసుకుని తినండి.. చట్నీలో బల్లి, బొద్దింక ఇంకా ఏమైనా రావచ్చు.. జంతు అవశేషాలు కనిపిస్తే నిర్వాహకులు సింపుల్‌గా కొట్టి పారేస్తారు. నిలదీస్తే దబాయిస్తారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్ నుంచి టిఫిన్‌తోపాటు తీసుకెళ్లిన చట్నీలో బల్లి అవశేషాలు కనిపించగా అడిగిన వినియోగదారుడికి 'కొత్తిమీట కట్ట, ఆకు కూర' అయి ఉండొచన్నారు. గట్టిగా నిలదీస్తే దబాయించారు. సోమవారం పట్టణంలో జరిగిన ఘటన హోటళ్లకు నిర్వహణకు అద్దం పడుతోంది.

ప్రజల ఆరోగ్యం గాలికి..

పట్టణంలోని హోటళ్ల నిర్వాహకులకు సంపాదనే లక్ష్యంగా మారింది. ప్రజల ఆరోగ్య భద్రతను గాలికి వదిలేశారు. ఆహార పదార్థాలు, తిను బండారాల తయారీలో నిబంధనలు పాటించకుండా కస్టమర్ల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. టేస్ట్ కోసం బిర్యానీలో రంగులు, ఫాస్ట్‌ఫుడ్‌లో హానికరమైన లిక్విడ్స్ కలుపుతూ కొత్త రోగాలకు కారకులవుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. కిచెన్ షెడ్లు మురికి కూపాలను తలపిస్తున్నాయి. వడ, మిర్చి, దోష, పూరీ తదితర పిండి వంటల తయారీ ముడిసరుకును అపరిశుభ్రత వాతావరణంలో ఉంచుతున్నారు. బల్లులు, బొద్దింకలు, ఇతర క్రిమి కీటకాలు సంచరిస్తున్నా పట్టించుకోవడం లేదు. కొన్ని చోట్ల రిఫ్రిజిరేటర్లలో నిల్వ చేసిన చికెన్, మటన్ కర్రీలను వినియోగదారులకు అంటగడుతున్నారు. కుళ్లిన వంటకాలు, జంతు అవశేషాలు, అపరిశుభ్రత కనిపించిన కస్టమర్లు ఫిర్యాదు చేస్తే కనీస చర్యలు ఉండడం లేదు. ప్రత్యేకంగా ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్తే వచ్చి ఎంతో కొంత జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారు. ల్యాబ్‌కు పంపిస్తామని శాంపిళ్ల పేరిట సేకరిస్తున్న ఆ పదార్థాలకు సంబంధించిన రిపోర్టుల జాడే ఉండడం లేదు. గతంలో నెహ్రూపార్కు ఏరియాలోని రాఘవేంద్ర టిఫిన్ సెంటర్, సాయిక్రిష్ణ హోటల్, బార్ అండ్ రెస్టారెంట్, దాబాలు, రెస్టారెంట్లు తదితర వాటిలో కుళ్లిన మాసం వంటకాలు, జంతు అవశేషాలతో చట్నీ బయటపడడంతో జరిమానా మినహా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల మోర్ సూపర్ మార్కెట్‌లో కాలం చెల్లిన బలవర్థకమైన ఆహార పదార్థాలు విక్రయించగా జరిమానాతో సరిపుచ్చారు.



సాయిక్రిష్ణ హోటల్ చట్నీలో వచ్చిన బల్లి అవశేషాలు

ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌లు ఉన్నాయా..?

పట్టణంలో చాలా హోటళ్లకు ట్రేడ్ లైసెన్స్‌లు, ఫుడ్ సేఫ్టీ అనుమతులు లేవని తెలుస్తున్నది. కనీసం ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేని హోటళ్లపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆహార భద్రత అధికారులు వచ్చి తనిఖీ చేసిన దాఖలాలూ కనిపించవు. ఒక వేళ ఎవరైనా వినియోగదారులు ఫిర్యాదు చేస్తే మొక్కుబడిగా వచ్చి జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారు.



హోటల్ కిచెన్ పక్కనే కూరగాయల వ్యర్థాలు

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో అధ్వానం

జిల్లా కేంద్రంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో విక్రయిస్తున్న చికెన్ ఎంత వరకు సేఫ్ అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చికెన్ సెంటర్ల వద్ద కటింగ్ చేసే సమయంలో పడేసే వేస్టేజ్‌ను తీసుకు వచ్చి ఫ్రైడ్‌రైస్, నూడిల్స్ తయారు చేసి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా రాత్రి మిగిలిన వంటకాన్ని రిఫ్రిజిరేటర్‌లో భద్రపరిచి మరుసటి రోజు వేడి చేసి అమ్ముతున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు



హోటళ్ల నిర్వాహకులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే చర్యలు కఠినంగా ఉంటాయి. సోమవారం చట్నీలో బల్లి అవశేషాలు వచ్చిన సాయిక్రిష్ణ హోటల్‌కు గతంలోనూ రూ.5వేల జరిమానా వేశాం. ప్రస్తుతం కస్టమర్ ఫిర్యాదుతో ల్యాబ్‌కు పంపించి రెండు రోజులు హోటల్‌ను సీజ్ చేశాం. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం అయితే హోటల్ శాశ్వతంగా మూసివేస్తాం. ఈ మేరకు యజమానితో లిఖిత పూర్వకంగా తీసుకున్నాం.

\- చేపూరి కృష్ణమూర్తి, గెజిటెడ్ ఫుడ్‌సేఫ్టీ అధికారి, వరంగల్

నిర్ణీత సమయంలో లక్ష్యాలు సాధించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వనమహోత్సవం, జలశక్తి అభియాన్, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వనమహోత్సవంపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని చెప్పారు. జీపీలు, హాస్టళ్లు, స్కూళ్లు, గ్రంథాలయాలు, పీహెచ్‌సీలు, పశువైద్య కేంద్రాలు, ప్రభుత్వ భవనాలు, రైతు వేదికలు, అంగన్వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. 'బడిబాట' నిర్వహించే గ్రామ సభల్లో వనమహోత్సవం ఆవశ్యకతతో పాటు జాతీయ కుటుంబ లబ్ధి పథకంపై వివరించాలని చెప్పారు. జలశక్తి అభియాన్‌లో భాగంగా వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోవడానికి సోక్ పిట్, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటిలో క్లోరినేషన్ చేయాలని, దోమల నివారణకు మురికివాడల్లో ఫాగింగ్ చేయించాలని చెప్పారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ మాధురి షా, డీఆర్డీఓ వసంత, డీపీఓ స్వరూప, ఆయా శాఖల జిల్లా అధికారులు మల్లికార్జునరావు, రామారావునాయక్, రాధాకిషన్, శ్రీధర్, రవీందర్, అనిత పాల్గొన్నారు.

'భూ భారతి' చట్టం రైతులకు వరం

జఫర్‌గఢ్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'భూ భారతి' చట్టం రైతులకు వరం లాంటిదని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. కోనాయిచలంలో గురువారం నిర్వహించిన భూ భారతి గ్రామ సభను ఆయన సందర్శించారు. ఆర్డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ శంకరయ్య, డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

జఫర్‌గఢ్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందని చెప్పారు. ఆర్డీఓ డీఎస్ వెంకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మానవ జాతికి వృక్షాలే ఆధారం

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ రూరల్: మానవ జాతికి వృక్షాలే ఆధారం.. పర్యావరణం పచ్చగా ఉండాలంటే మొక్కలు నాటాలి.. ప్లాస్టిక్‌ను నిషేధించాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బాల సదన్‌ను సందర్శించి బాలికలతో మొక్కలు నాటించారు. చెట్లతో భవిష్యత్ తరాలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. పిల్లలతో మొక్కలు నాటించటం వల్ల వారికి సైన్స్‌పై అవగాహన పెరుగుతుందని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగంతో భూసారం తగ్గడంతో పాటు అనారోగ్యానికి కారణమతుందని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, కె.వేరోనికా, ఎం.కృష్ణవేణి బి.స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



బాలసదన్‌లో మొక్క నాటుతున్న చిన్నారులు

'బడిబాట'కు వేళాయె..

- నేటి నుంచి రెండో విడత షురూ..
- ఇంటింటి ప్రచారానికి ఉపాధ్యాయులు
- 19న క్రీడా దినోత్సవంతో ముగింపు
- మొదటి విడతలో 132 మంది గుర్తింపు

జనగామ: అమ్మ ఆదర్శ పాఠశాలలతో కార్పొరేట్‌కు ధీటుగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత విద్యాబోధన.. పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్న సర్కారు స్కూళ్లలో పిల్లలను చేర్పించాలంటూ టీచర్లు ఇంటింటా ప్రచారం చేయడానికి సన్నద్ధమయ్యారు. గత నెల చేపట్టిన ముందస్తు 'బడిబాట' ముగియగా.. నేటి(శుక్రవారం) నుంచి రెండో విడత ప్రారంభం కానుంది. సర్కారు స్కూళ్లలో కల్పిస్తున్న వసతులపై ఈనెల 19వ తేదీ వరకు ఊరూరా ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఆయా పాఠశాలల్లో విద్యాబోధన గురించి కార్పొరేట్ తరహాలో ముద్రించిన కరపత్రాలతో ప్రచారం నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా మొదటి విడత 'బడిబాట' కార్యక్రమంలో 132 మంది విద్యార్థులను గుర్తించి అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను సంప్రదిస్తున్నారు.

కార్యాచరణ మేరకు..

డీఈఓ భోజన్న ఆధ్వర్యాన నేటి నుంచి నిర్వహించ తలపెట్టిన రెండో విడత 'బడిబాట' ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన కార్యాచరణ మేరకు ముందు వెళ్లనున్నారు. గ్రామ సభలు, బడిఈడు పిల్లల గుర్తింపు, ఇంటింటి ప్రచారం, అంగవాడీ కేంద్రాల సందర్శన, డ్రాప్‌ఔట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడం తదితర క్యాక్రమాలు చేపట్టాలి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల ప్రారంభం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ, సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభ, విలీన విద్య, బాలిక విద్యా దినోత్సవం, తరగతి గదుల డిజిటలీకరణపై అవగాహన, మొక్కల పెంపకం, విద్యార్థులకు క్రీడా పోటీలతో 'బడిబాట' ముగియనుంది.



లింగాలఘణపురం మండలం గుమ్మడవెల్లిలో 'బడిబాట'లో పాల్గొన్న ఉపాధ్యాయులు(ఫైల్)

'బడిబాట' కార్యక్రమాలు ఇలా..

6న : గ్రామసభలు
7న : ఇంటింటికీ వెళ్లి పిల్లల గుర్తింపు
8 నుంచి 10 వరకు : కరపత్రాలతో ఇంటింటి ప్రచారం. అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన. డ్రాప్‌ఔట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడం. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించడం.
11న : 10వ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష
12న: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యాన చేపట్టిన పనుల ప్రారంభం. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం పంపిణీ.
13న: సామూహిక అక్షరాభ్యాసం. బాలల సభ
16న: ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ దినోత్సవం
17న: విలీన విద్య, బాలిక విద్యా దినోత్సవం
18న: తరగతి గదుల డిజిటలీకరణపై అవగాహన. మొక్కల పెంపకం
19న: విద్యార్థులకు క్రీడా పోటీలు

సర్కారు స్కూళ్లలోనే నాణ్యమైన విద్య



సర్కారు స్కూళ్లలో నాణ్యమైన విద్య అందిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలి. సర్కారు స్కూళ్లలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజనం అందజేస్తారు. కార్పొరేట్‌కు ధీటుగా డిజిటల్ తరగతులు, స్పెషల్ క్లాసులు, సబ్జెక్టుల వారీగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత విద్యాబోధన ఉంటుంది. ప్రైవేట్ మాయలో పడొద్దు. డబ్బులు వృథా చేసుకోవద్దు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. - భోజన్న, డీఈఓ

మొక్కలతోనే మానవ మనుగడ

జనగామ రూరల్: మొక్కల పెంపకంతోనే వాతావరణ సమతుల్యం ఏర్పడి మానవజాతి మనుగడ సాధ్యమవుతుందని డీపీఓ స్వరూప, డీఆర్డీఓ వసంత అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పెంబర్తిలో మొక్కలు నాటిన అనంతరం వారు మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచంలో గ్లోబల్ వార్మింగ్ పెరుగుతోందని, మానవుడు అనేక వ్యర్థాలను గాలిలోకి వదడంతో వాయు కాలుష్యం ఏర్పడుతోందని చెప్పారు. దీనిని నివారించడం కేవలం మొక్కల పెంపకం వల్లే సాధ్యం అవుతుందని, ప్రతి ఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సంపత్‌కుమార్, ఏపీఓ భిక్షపతి, ఈసీ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రఫుల్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న డీపీఓ, డీఆర్డీఓ

సీఎంఆర్ గడువులోగా పూర్తయ్యేనా?

వానాకాలం బియ్యం మరాడింపు ప్రక్రియ మరీ స్లో..

- ఉమ్మడి వరంగల్‌లో మిల్లర్లకు 7.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం
- సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన బియ్యం 5.04 లక్షల మెట్రిక్ టన్నులు..
- రెండు నెలల్లో ఇచ్చింది 11,068 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే
- యాసంగి సీఎంఆర్‌పైన నిర్లక్ష్యమే.. డిఫాల్టర్‌లకు సీఎంఆర్ ధాన్యం?

సాక్షిప్రతినిధి, వరంగల్ : రైతులు పండించిన ధాన్యాన్ని వానాకాలం, యాసంగి సీజన్లలో ఏటా సేకరిస్తున్న ప్రభుత్వం.. మర ఆడించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైస్‌మిల్లులకు అప్పగిస్తోంది. కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కోసం ఇచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మరాడించి బియ్యాన్ని గడువులోగా పౌరసరఫరాల కార్పొరేషన్, ఎఫ్‌సీఐలకు మిల్లర్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఉమ్మడి జిల్లాలో గతేడాది రెండు సీజన్లలో సీఎంఆర్ ప్రక్రియ అనుకున్నంత వేగంగా జరగలేదు. అయినప్పటికీ అధికారులు ఈ వానాకాలానికి సంబంధించి కూడా సుమారు 281 రా రైస్, పారాబాయిల్డ్ రైస్‌మిల్లులకు సీఎంఆర్ ధాన్యం సరఫరా చేశారు. రెండు నెలలు కావస్తున్నా కేవలం 2.19 శాతం మాత్రమే రైస్‌మిల్లర్లు బియ్యం ప్రభుత్వరంగ సంస్థలకు అందజేశారు.

సర్కారు ధాన్యంతో మిలర్ల వ్యాపారం..

సీఎంఆర్ కింద ధాన్యం ఇచ్చే క్రమంలో రైస్‌మిల్లుల యజమానులకు గడువు విధించి నిర్దేశించిన సమయంలోగా అప్పగించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. అయితే ఏటా మిల్లుల యజమానులు గడువును లెక్కచేయకుండా ధాన్యాన్ని బియ్యంగా మార్చి సొంత వ్యాపారం చేసుకుంటూ.. వారికి నచ్చినప్పుడు పౌరసరఫరాల సంస్థ, ఎఫ్‌సీఐలకు బియ్యం అప్పగిస్తున్నారు. ఇలా ప్రతి ఏటా జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో రైస్‌మిల్లులకు ఈ సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన 7,42,261 మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ కింద ఇచ్చారు. ఇందుకు 5,04,737 మెట్రిక్ టన్నుల బియ్యం ఆగస్టు వరకు పూర్తిగా ఇవ్వాల్సి ఉండగా.. రెండు నెలల్లో కేవలం 11,068(2.19 శాతం) మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే మిలర్లు ఇచ్చారు. గతేడాది వానాకాలం, యాసంగి సీఎంఆర్‌కు సంబంధించి సుమారు రూ.561 కోట్ల విలువైన బియ్యం పెండింగ్‌లో ఉండగా.. ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి 4,93,669 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు ఎప్పటి వరకు ఇస్తారన్న చర్చ జరుగుతోంది.



సీఎంఆర్ జాబితాలో డిఫాల్టర్లు..!

గతం వానాకాలం, యాసంగి సీజన్లలో సీఎంఆర్ కింద ధాన్యం తీసుకుని ఇంకా బియ్యం ఇవ్వని డిఫాల్టర్‌లకు ఈ వానాకాలంలో సీఎంఆర్ కింద ధాన్యం ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువగా హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో జరిగినట్లు ఫిర్యాదులున్నాయి.

- హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో రెండు రైస్‌మిల్లులను నడుపుతున్న హసన్‌పర్తికి చెందిన ఓ వ్యాపారి రూ.కోట్లలో సీఎంఆర్ ఎగవేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అతడిపై రెవెన్యూ రికవరీ యాక్టు పెట్టే అవకాశం ఉన్నా.. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ ధాన్యం కేటాయించడం వివాదాస్పదం అవుతోంది.
- హసన్‌పర్తి మండలం సీతంపేట సమీపంలోని ఓ రైస్‌మిల్లును లీజుకు తీసుకుని సివిల్‌సప్లయీస్ ద్వారా తీసుకున్న సుమారు రూ.15 కోట్ల విలువైన ధాన్యానికి మంగళం పాడినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అలాగే గత వానాకాలం, యాసంగి సీఎంఆర్ ఇవ్వని డిఫాల్టర్‌లకు ఈ సీజన్‌లో ధాన్యం ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఈ సీజన్‌లోనూ రైస్‌మిల్లులకు బ్యాంకు గ్యారంటీ, షూ్యరిటీలు తీసుకుని సీఎంఆర్ కింద ధాన్యం కేటాయించామని, సీఎంఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి వరంగల్‌కు చెందిన పౌరసరఫరాలశాఖ అధికారి ఒకరు తెలిపారు.

జిల్లా	మొత్తం ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో..)	ఇవాల్సిన సీఎంఆర్	ఇచ్చిన బియ్యం	ఇంకా ఇవ్వాల్సిన బియ్యం
హనుమకొండ	1,14,129	77,608	2,091	75,517
వరంగల్	1,55,177	1,05,520	00	1,05,520
మహబూబాబాద్	1,69,073	1,14,970	00	1,14,970
జనగామ	1,61,246	1,09,647	7,042	1,02,605
ములుగు	72,640	49,395	804	48,591
జేఎస్ భూపాలపల్లి	69,996	47,597	1,131	46,466
	7,42,261	5,04,737	11,068	4,93,669

క్లుప్తంగా

కాజీపేట- దాదర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

- అప్ అండ్ డౌన్ రూట్‌లో 8 రోజులు..
- ఈ నెల 7 నుంచి అమల్లోకి..

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో బెల్లంపల్లి -రెచ్నీరోడ్ స్టేషన్ల మధ్య జరుగుతున్న 3వ రైల్వే లైన్‌కు సంబంధించిన నాన్ ఇంటర్‌లాకింగ్ వర్క్స్ కారణంగా కాజీపేట జంక్షన్ నుంచి బయలుదేరే కాజీపేట–దాదర్ ఎక్స్‌ప్రెస్‌ను అప్ అండ్ డౌన్ రూట్‌లో 8 రోజులు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీ ఆర్వో ఎ.శ్రీధర్ గురువారం తెలిపారు.

రద్దయిన దాదర్ ఎక్స్‌ప్రెస్ వివరాలు

ఈనెల 7, 14, 21, 28వ తేదీల్లో కాజీపేట–దాదర్ సెంట్రల్ (07197) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 8,15,22,29వ తేదీల్లో దాదర్–కాజీపేట (07198) ఎక్స్‌ప్రెస్ రద్దయినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు..

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణికుల సౌకర్యార్థం ఆరు వేసవి ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీ ఆర్వో ఎ.శ్రీధర్ గురువారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు

ఈ నెల 10వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మూడు సర్వీస్‌లుగా ప్రతీ మంగళవారం చర్లపల్లి–డెహ్రాడూన్ (07077) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు చేరుకుని వెళ్తుంది. అదేవిధంగా ఈ నెల 12వ తేదీ నుంచి 26వ తేదీ వరకు మూడు సర్వీస్‌లుగా ప్రతీ మంగళవారం డెహ్రాడూన్–చర్లపల్లి (07078) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు చేరుకుని వెళ్తుంది. ఈ రైళ్ల సర్వీస్‌లకు అప్ అండ్ డౌన్ రూట్‌లలో కాజీపేట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్లార్షా, నాగ్‌పూర్, ఇటార్సీ, రాణి కమలాపతి, భీనా, ఝాన్సీ, ఆగ్రా, మధుర, హజ్రత్‌నిజాముద్దీన్, మీరట్, రోర్కి, హరిద్వార్ స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించినట్లు సీపీఆర్వో తెలిపారు.

పోక్సో కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

మహబూబాబాద్ రూరల్/ నర్సింహులపేట : మహబూబాబాద్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన మూడేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ గురువారం తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మూడేళ్ల బాలికపై 2018 ఏప్రిల్ 30వ తేదీన ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి అదే ఏడాది జూలై 19వ తేదీన కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ గణేశ్ ఆనంద్ వాదనలు వినిపించగా పోలీసులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు ప్రత్యేక న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ .. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని నెహ్రూనగర్‌కు చెందిన షేక్ మహబూబ్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం..

ప్రత్యామ్నాయ పంటల కోసం ఎదురుచూసే రైతులకు సదావకాశం

- 2025–2026 ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు
- సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి : హనుమకొండ డివిజన్ ఉద్యాన అధికారి సుస్మిత



సుస్మిత

ఐనవోలు: వివిధ పంటలకు గిట్టుబాటు ధర లభించక పోవడం.. విత్తన కల్తీ, చీడ పీడలు ఆశించడం.. రసాయన ఎరువుల, పురుగు మందుల పిచికారీలు అధికమవడం.. సరైన సమయంలో కూలీలు దొరకక పోవడం, కూలి కూడా పెరగడం లాంటి తదితర సమస్యలతో సాగులో రైతులు విసిగివేసారిపోతున్నారు. ఈ నేపథ్యంలో పత్తి, మొక్కజొన్న, వరి లాంటి సంప్రదాయ పంటలే కాకుండా తక్కువ పెట్టుబడి, ప్రభుత్వ సబ్సిడీ పొందుతూ ప్రత్యామ్నాయ ఉద్యాన పంటలు సాగు చేసుకోవచ్చు. దీని వల్ల అన్నదాతలు అధిక లాభాలు పొందొచ్చు. ఈ క్రమంలో ఉద్యాన శాఖ ద్వారా 2025–2026 ఆర్థిక సంవత్సరంలో అమలవుతున్న వివిధ పథకాల గురించి హనుమకొండ డివిజన్ ఉద్యాన అధికారి సుస్మిత వివరించారు. ఆసక్తిగల రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి పలు పథకాల ద్వారా లబ్ధి పొందాలని ఆమె సూచించారు.



గులాబీ తోట(ఫైల్)



బంతిపూల తోట(ఫైల్)

మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు..

తెలంగాణ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు(టీజీఎంఐపీ) పథకం ద్వారా డ్రిప్ ఇరిగేషన్ కోసం ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, ఓబీసీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీ లభిస్తుంది. స్ప్రింక్లర్ ఇరిగేషన్ కోసం అన్ని కేటగిరీలకు 75 శాతం సబ్సిడీ లభిస్తుంది.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన..

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై) పథకంలో తీగజాతి కూరగాయల సాగు కోసం రైతులు శాశ్వత పందిరి నిర్మాణం చేసుకోవచ్చు. హార్టికల్చర్ అధికారుల అంచనా మేరకు యూనిట్ (అర ఎకరం)లో శాశ్వత పందిరి నిర్మాణం చేపడితే రూ.లక్ష ఖర్చవుతుంది. ఇందులో 50 శాతం సబ్సిడీ రూ. 50వేలు రైతుకు అందిస్తుంది.

నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్..

నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎన్ఎంఈఓ–ఓపీ) పథకం ద్వారా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.4,200 సబ్సిడీ గరిష్ఠంగా 4 ఎకరాల వరకు లభిస్తుంది. ఆయిల్ పామ్ సాగు చేపట్టాలనే ఆలోచన ఉన్న రైతు ముందు సబ్సిడీ ద్వారా డ్రిప్ సమకూర్చుకోవచ్చు.

సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్..

సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్(ఎంఐడీహెచ్) పథకం ద్వారా పండ్ల తోటలు మామిడి, జామ, అరటి, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసే రైతులకు 40 శాతం సబ్సిడీ అందుతుంది. మల్చింగ్ షీట్‌లు ఏర్పాటు చేసుకుంటే 50 శాతం ఎకరానికి రూ. 8వేలు, పూల పెంపకం కింద 50 శాతం ఎకరానికి రూ. 8వేలు, పాత తోటల పునరుద్ధరణకు 40 శాతం , నీటి కుంటల ఏర్పాటుకు 50 శాతం, ప్యాక్ హౌస్‌కు 50 శాతం, ఫ్రూట్ కవర్స్ ఏర్పాటు చేసుకుంటే 50 శాతం, కూరగాయల సాగుకు 40 శాతం మేర సబ్సిడీ లభిస్తుంది.

జాతీయ వెదురు మిషన్..

జాతీయ వెదురు మిషన్(ఎన్‌బీఎం) పథకం ద్వారా పొలం గట్లపై వెదురు మొక్కల పెంపకం చేపడితే 50 శాతం సబ్సిడీ పొందొచ్చు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, బ్యాంకు అకౌంట్, పాస్‌ఫొటోతో ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలి.

ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అడుగులు

- వ్యవసాయేతర భూ యజమానులతో అధికారుల చర్చలు
- చదరపు గజానికి రూ.4,887గా కమిటీ నిర్ణయం



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద, అధికారులు

న్యూశాయంపేట: వరంగల్ మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో 240 ఎకరాల వ్యవసాయ భూమి సేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కలెక్టర్ అధ్యక్షతన 309 మంది రైతులతో బుధవారం డిస్ట్రిక్ట్ లెవల్ ల్యాండ్ నెగోషియేషన్ కమిటీ కాన్సెంట్ అవార్డుగా ఎకరానికి 1.20 కోట్లుగా నిర్ణయించిన విషయం తెలిసిందే..

చదరపు గజానికి రూ.4,887గా నిర్ణయం

వ్యవసాయేతర భూములు కోల్పోయిన భూ యజమానులకు అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో గాడిపల్లి ప్రాంతంలో వ్యవసాయేతర భూమి కోల్పోయిన భూముల పరిహారం చెల్లింపుపై భూ యజమానులతో గురువారం వరంగల్ కలెక్టరేట్‌లో ల్యాండ్ నెగోషియేషన్ కమిటీ చర్చలు జరిపింది. 61134.5 చదరపు గజాల మేర భూములు, ప్లాట్లు కోల్పోతున్న 50 మంది యజమానులకు ప్రభుత్వం నిర్ణయించిన ధర చదరపు గజానికి రూ.4,887గా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ లెవల్ ల్యాండ్ నెగోషియేషన్ కమిటీ నిర్ణయించింది.

అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి..

సమావేశంలో భూ యజమానులతో కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. వరంగల్ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న విమానాశ్రయానికి భూయజమానులు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్, ల్యాండ్ అక్విజేషన్స్ సూపరింటిండెంట్ శ్రీకాంత్, ఈఈ ఇరిగేషన్ శంకర్, ఆర్అండ్‌బీ డీఈ దేవికచౌహాన్, ల్యాండ్ అక్విజేషన్ డి.టి.త్రినాథ్‌రెడ్డి, గాడిపల్లి భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

సాక్షి ములుగు ఆర్సీ ఇన్‌చార్జ్ సునీల్ కన్నుమూత

- మంత్రి సీతక్క సంతాపం



భూక్య సునీల్‌కుమార్ (ఫైల్)

ఏటూరునాగారం: సాక్షి దినపత్రిక ములుగు ఆర్సీ ఇన్‌చార్జ్ భూక్య సునీల్‌కుమార్(37) గురువారం ఉదయం అనారోగ్య సమస్యలతో కన్నుమూశారు. రెండు రోజులక్రితం అనారోగ్యం బారిన పడిన సునీల్.. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. ఈ మేరకు సాయంత్రం తన స్వగ్రామమైన ములుగు మండలం కొడిశెలకుంటతండాలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమయాత్రలో భూపాలపల్లి, ములుగు జిల్లాలోని సాక్షితోపాటు అన్ని పత్రికలు, మీడియా సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు. అదే విధంగా మంత్రి సీతక్క కుమారుడు సూర్య, గ్రంథాలయ చైర్మన్ రవీందర్‌లు సునీల్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మీడియాకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.



సునీల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క తనయుడు సూర్య

సునీల్ మృతి తీరని లోటు : మంత్రి సీతక్క

సాక్షి ములుగు రిపోర్టర్ భూక్య సునీల్ మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సునీల్ మృదుస్వభావం కలిగిన వ్యక్తి అందరితో ఆప్యాయంగా ఉంటూ తన వృత్తికి వన్నెతెస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే వ్యక్తి అని పేర్కొన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం.. పురుగుల మందు డబ్బాలతో నిరసన



పురుగుల మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేస్తున్న నిరుపేదలు

కమలాపూర్: అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని ఆరోపిస్తూ కొందరు నిరుపేదలు పురుగుల మందు డబ్బాలతో నిరసన చేపట్టారు. ఈ ఘటన గురువారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాలలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. ఇందిరమ్మ ఇల్లు పథకంలో భాగంగా మొదటి విడుతలో అంబాలలో 36 మందిని ఎంపిక చేశారు. అయితే ఇందులో అర్హులకన్నా అనర్హులే ఎక్కువ ఉన్నారని ఆరోపించారు. భారమైనా ఇన్నేళ్లుగా కిరాయికి ఉంటున్నామని, సొంతింటి కోసం ఎదురు చూస్తున్న అర్హులైన తమను కాదని అనర్హులకే ఇళ్లు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటూనే అర్హులకు అన్యాయం చేస్తూ అనర్హులను అందలం ఎక్కిస్తున్నారన్నారు. మొదటి జాబితా నుంచి వెంటనే అనర్హులను తొలగించి అర్హులకు ఇళ్లు కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని, అధికారులు పట్టించుకోకపోతే ఆత్మహత్యలు చేసుకోవడానికి సిద్ధమని వారు హెచ్చరించారు.

మామపై అల్లుడి హత్యాయత్నం.. పరిస్థితి విషమం

- వీఎస్.లక్ష్మీపురంలో ఘటన



ఆస్పత్రిలో గట్టయ్య

మహబూబాబాద్ రూరల్ : తనకు భూమిరాసి ఇస్తానని చెప్పిన మామ.. ఆ భూమి రిజిస్ట్రేషన్ చేయడంలేదని ఆగ్రహానికి గురైన అల్లుడు సొంత మామపై గొడ్డలితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మహబూబాబాద్ మండలం వీఎస్.లక్ష్మీపురంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక గురువారం కేసు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన దిడ్డి గట్టయ్య, సోమలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె నాగమణిని ములుగు జిల్లా పస్రా మండలానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశాడు. చిన్నకుమార్తె శ్రావణిని అదే గ్రామానికి చెందిన పచ్చిపాల నరేశ్‌కు ఇచ్చి వివాహం జరిపించాడు. గట్టయ్యకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఇద్దరు కుమార్తెలకు చెరి రెండు ఎకరాల చొప్పున రిజిస్ట్రేషన్ చేస్తానని ఒప్పుకున్నాడు. ఇద్దరు బిడ్డలకు రెండెకరాల చొప్పున భూమిపోతే తాము ఎలా బతకాలని అడగగా ఇద్దరు కుమార్తెలు చెరి రెండు రూ.లక్షలు నగదు తల్లిదండ్రులకు ఇచ్చేలా పెద్ద మనుషులు తీర్మానం చేశారు. అల్లుడు నరేశ్ డబ్బులు ఇవ్వకపోవడంతో గట్టయ్య భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా ఉన్నాడు. దీంతో నరేశ్ ఆగ్రహానికి గురై భార్యను తరచూ కొడుతుండగా బాధతో తల్లిగారింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఆ కోపాన్ని మనసులో పెట్టుకుని నరేశ్ తన అన్న లింగయ్యతో వెళ్లి గొడ్డలితో మామ గట్టయ్యపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. అదే విధంగా అత్త సోమలక్ష్మి, భార్య శ్రావణి, గట్టయ్య తల్లి లింగమ్మపై కూడా దాడిచేసి గాయపరిచాడు. తీవ్రగాయాలైన గట్టయ్యను వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పచ్చిపాల శ్రావణి ఫిర్యాదు మేరకు ఆమె భర్త నరేశ్, తన అన్న లింగయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

అండర్-19 ఆరు జిల్లాల జట్ల ఎంపిక



ఆరు జిల్లాల జట్లతో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న అండర్–19 అంతర్‌జిల్లాల స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఆరు జిల్లాల జట్ల ఎంపిక పూర్తయినట్లు డబ్ల్యూడీసీఏ కార్యదర్శి శ్రీనివాస్ గురువారం తెలిపారు. వంగపల్లి క్రీడామైదానంలో నిర్వహించిన హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జట్ల ఎంపికల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కూడిన ఆరు జట్లు నేటి నుంచి జనగామ, భూపాలపల్లి, ములుగు జిల్లాల వేదికలుగా జరిగే అంతర్‌జిల్లాల స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు హెచ్‌సీఏ నిర్వహించే అండర్–19 లీగ్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. సెలక్షన్ కమిటీ చైర్మన్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు పవన్, కుమార్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు తోట రాము, సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, కార్యవర్గ సభ్యులు అభినవ వినయ్, తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా రిటర్న్‌లు ఫైల్ చేయాలి

- ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ రావిశ్ వి.బట్టు

హన్మకొండ: ప్రతీ ఆర్థిక సంవత్సరంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఆదాయ పన్ను రిటర్న్‌లు ఫైల్ చేయాలని ఆ శాఖ అదనపు కమిషనల్ రావిశ్ వి.బట్టు అన్నారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ముఖ్య కార్యనిర్వహణాధికారులకు ఆదాయపు పన్నుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రావిశ్ వి.బట్టు మాట్లాడుతూ గడువులోగా రిటర్న్‌లు దాఖలు చేసిన వారికి మాత్రమే సెక్షన్ 80 పి, ఇతర మినహాయింపులు లభిస్తాయన్నారు. ఆదాయపన్ను ఉప కమిషనర్ జి.రవికిరణ్.. ప్రాథమిక సహకార సంఘాల ఆదాయపు పన్ను నిబంధనలు, మినహాయింపులకు సంబంధించిన చట్టాలపై వివరించారు. వరంగల్ జిల్లా ఆదాయపు పన్ను అధికారి జి. చక్రధారి మాట్లాడుతూ ఆదాయపన్ను శాఖ నోటీసులకు సంబంధించిన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ముఖ్య కార్యనిర్వహణాధికారులు, జిల్లా సహకార అధికారులు పాల్గొన్నారు.

పరిశోధన రూపకల్పన కీలకం



మాట్లాడుతున్న హరిప్రసాద్

కేయూ క్యాంపస్: పరిశోధకులకు పరిశోధన రూపకల్పన అనేది కీలకమని కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోషల్ సైన్సెస్ పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీపై గురువారం నిర్వహిస్తున్న అవగాహన తరగతుల్లో ఆయన మాట్లాడారు. సామాజిక శాస్త్ర పరిశోధనలకు ఊహాజనిత సిద్ధాంతం అనేది కేంద్ర బిందువుగా ఉంటుందని చెప్పారు. పరిశోధనలు అనేవి వివిధ అంశాలపై ఆధారపడి ఉంటాయని, ముఖ్యంగా అవి వివరణాత్మక పరిశోధన, విశ్లేషణాత్మక పరిశీలన, మిశ్రమ పద్ధతి పరిశీలన అని వివరించారు. సమావేశంలో విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, బీఓఎస్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, పరిశోధకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటినుంచి వెళ్లిన ఐదు గంటలకే ఆత్మహత్య..

- హైదరాబాద్‌లో లింగాలఘణపురం యువకుడి ఆత్మహత్య
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు



సాయిరామ్ (ఫైల్)

లింగాలఘణపురం: ఉన్నత విద్యనభ్యసించి ప్రయోజకుడవుతాడని భావించి రెక్కలుముక్కలు చేసుకుని చదివిస్తున్న కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన సోమ వెంకటేశ్, యాకమ్మ దంపతుల కుమారుడు సాయిరామ్ (21) హైదరాబాద్‌లో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి గురువారం మరో స్నేహితుడితో కలిసి బైక్‌పై హైదరాబాద్ వెళ్లాడు. స్నేహితులతో కలిసి ఉంటున్న గదిలో కొద్దిసేపు ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం పై నుంచి కింది గదిలోకి వచ్చి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు బోరును విలపించారు. ఇంటి నుంచి వెళ్లిన ఐదు గంటలకే ఆత్మహత్య చేసుకోవడం, కారణాలు తెలియకపోవడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. వెంకటేశ్, యాకమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా ఇందులో సాయిరామ్ పెద్ద కుమారుడు. కాగా, సాయిరామ్ ఆత్మహత్యపై అక్కడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

కొరిపెల్లిలో ఇంటర్ విద్యార్థి..



విజయ్(ఫైల్)

పెద్దవంగర : ఉరేసుకుని ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం మండలంలోని కొరిపెల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడ్ల చిరంజీవి, చందన దంపతులకు విజయ్(18), నాని సంతానం. విజయ్ ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తి చేశాడు. కాగా, విజయ్ గత కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో గురువారం ఎవరూ ఇంట్లో లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తలుపులు వేసి ఉండడంతో స్థానికులు వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించాడు. విజయ్ మృతికి కారణాలు తెలియలేదు. ఈ ఘటనపై ఎస్సై క్రాంతికిరణ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

శాంతియుతంగా బక్రీద్ జరుపుకుందాం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్





సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్, పాల్గొన్న అధికారులు, మత పెద్దలు

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకుందామని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ పిలుపునిచ్చారు. గురువారం కమిషనరేట్ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ.. నగరంలో అన్ని మతాలవారు ఒకరినొకరు గౌరవించుకుంటూ పండుగలను నిర్వహించుకుంటున్నామని, పండుగ సందర్భంగా ఎలాంటి సమస్య రాకుండా అందరు సహకరించాలని ఆయన సూచించారు. బక్రీద్ సందర్భంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ మాట్లాడుతూ.. పండుగ రోజు జంతు వ్యర్థాలను తరలించేందుకు ఎక్కువ సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, నర్సింహారావు, నందిరాం నాయక్, ప్రశాంత్‌రెడ్డి, కాజీపేట దర్గా పీఠాధిపతి, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, పశు సంవర్ధక శాఖ జాయింట్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణకు కృషి చేయాలి

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు చెక్ పెట్టేందుకు కృషి చేయాలని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. ఇటీవల కమిషనరేట్‌కు ఆపరేషన్స్ అండ్ క్రైమ్స్ అదనపు డీసీపీగా బదిలీపై వచ్చిన బోనాల కిషన్ గురువారం సీపీని కలిసి పూలమొక్క అందజేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం
- శివనగర్‌లో ఘటన

ఖిలా వరంగల్: షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. నిత్యావసరాలు, బీరువాల్లోని దుస్తులు పూర్తిగా కాలిబూదయ్యాయయి. ఈ ఘటన వరంగల్ శివనగర్‌లోని రుద్రమాంబ నగర్‌లో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. రుద్రమాంబనగర్‌కు చెందిన మాటూరి పారిజాతం, దేవేందర్ దంపతులు గురువారం ఉదయం 5 గంటలకు ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లేందుకు వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో తమ రేకుల ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు బాధితుడితోపాటు మిల్స్‌కాలనీ పోలీసులు, అగ్నిమాపక శాఖల అధికారులకు సమాచారమిచ్చారు. ఫైర్ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు వ్యాప్తి చెందకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే ఇంట్లోని నిత్యావసరాలతోపాటు దుస్తులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ ఘటనలో రూ. 2 ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, పోలీస్ అధికారులు వేర్వేరుగా పరామర్శించారు. అనంతరం సామాజికవేత్తలు మేరుగు అశోక్ రూ.10వేలు నగదు, గడ్డం రవి 50కేజీల బియ్యం బాధితుడికి అందజేశారు.